సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం । 19 । నవంబర్ । 2023



జయం మనదే..!

వరల్డ్ కప్ క్రికెట్ ఫైనల్ మ్యాచ్ ఆదివారం జరగనుండగా భారత్ జట్టు విజయం సాధిస్తుందనే ధీమా సర్వత్రా వ్యక్తమవుతోంది. 10లో



మానవతా ధర్మమే భక్తిమార్గం

ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడాన్ని భక్తి మార్గంగా భావించాలని గజల్ గాయకుడు డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. 10లో

గరిష్ఠం / కనిష్ఠం
33° / 21°

వాతావరణం

జిల్లాలో ఆదివారం ఉష్ణోగ్రత అధికంగానే నమోదవుతుంది. రాత్రి వాతావరణం కొంతమేర చల్లబడుతుంది.

న్యూస్‌రీల్

రామయ్యకు వైభవంగా సువర్ణ తులసీ అర్చన



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారికి శనివారం వైభవంగా సువర్ణ తులసీ అర్చన నిర్వహించారు. తెల్లవారు జామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం జరిపించారు. అనంతరం స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామి వారి ఆర్జిత సేవల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి



వంటశాలను పరిశీలిస్తున్న జీఎం శంకర్‌రావు

ఇల్లెందురూరల్: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లోని విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని ట్రైకార్ జీఎం శంకర్‌రావు ఆదేశించారు. ఇల్లెందు మండలంలోని రొంపేడు గిరిజన గురుకుల ఆశ్రమ పాఠశాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. తరగతి గదులు, వసతి గృహాలు, వంటశాల, ఆవరణను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆతర్వాత గతేడాది విద్యార్థులు సాధించిన ఫలితాలు, ఈ ఏడాది బోధనపై ఆరా తీసిన ఆయన ఉపాధ్యాయులతో సమావేశమై మెరుగైన ఫలితాలు సాధించేలా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఏపీడీ నర్సింహారావు, ఏటీడీఓ రూపాదేవి తదితరులు పాల్గొన్నారు.

100 శాతం ఉత్తీర్ణత సాధించాలి

ఐటీడీఏ డీడీ మణెమ్మ



విద్యార్థుల సామర్థ్యాన్ని పరీక్షిస్తున్న మణెమ్మ

గుండాల: పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఐటీడీఏ డీడీ మణెమ్మ అన్నారు. ఆళ్లపల్లి మండలం మర్కోడు, అనంతోగు ఆశ్రమ పాఠశాలలను శనివారం ఆమె తనిఖీ చేశారు. విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకోవడంతో పాటు వారి సామర్థ్యాలను పరీక్షించారు. అనంతరం మాట్లాడుతూ.. విద్యార్థుల ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. మెనూ సక్రమంగా పాటించాలని, లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం స్టాక్ రూమ్‌లు, తరగతి గదులను, హాజరు పట్టికలను పరిశీలించారు.

సీసీఐ పత్తి కొనుగోళ్లు ప్రారంభం



సీసీఐ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

కారేపల్లి: కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ద్వారా పత్తి కొనుగోళ్లను కారేపల్లిలో అధికారులు శనివారం ప్రారంభించారు. కారేపల్లిలోని లక్ష్మీప్రియ కోటెక్స్ జిన్నింగ్ మిల్లులో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటుచేయగా, జిల్లా మార్కెటింగ్ అధికారి అబ్దుల్ అలీం, ఇల్లెందు మార్కెట్ కార్యదర్శి నరేష్‌కుమార్ ప్రారంభించి మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో రెండు లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేయగా, 1.20లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేసినట్లు తెలిపారు. రైతులకు గిట్టుబాటు ధర లభించేలా సీసీఐ ద్వారా కొనుగోళ్లు చేపడుతున్నందున సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎనిమిది శాతం తేమ మించకుండా తీసుకొస్తే క్వింటాకు రూ.7,020 ధర లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యాపారులు, అధికారులు కిరణ్, వెంకటేశ్వర్లు, సుంకర కోటేశ్వరరావు, తుమ్మలపల్లి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మాటలు.. మంటలు

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ప్రచారం సందర్భంగా మాటలు తూటాలై పేలుతూ మంటలు పుట్టిస్తున్నాయి. ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు, వారి మద్దతుదారులతో పాటు స్వతంత్ర అభ్యర్థులు సైతం ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఈ క్రమంలో ప్రత్యర్థులపై మాటల దాడి ప్రారంభించారు. ముఖ్యంగా బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన అభ్యర్థుల మధ్య ఈ తరహా 'వార్ ఆఫ్ వర్డ్స్' ఎక్కువగా చోటుచేసుకుంటున్నాయి.

– సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం



జిల్లాలో జోరందుకున్న ఎన్నికల ప్రచారం

- ప్రత్యర్థి పార్టీలపై విమర్శల వెల్లువ
- ప్రతి విమర్శలతో వేడెక్కుతున్న రాజకీయం

పినపాకలో రేగా వర్సెస్ పాయం

పినపాక నియోజకవర్గంలోనూ ప్రధాన పార్టీల అభ్యర్థుల మధ్య మాటల మంటలు రేగుతున్నాయి. ఇసుక దందాలు, భూముల కబ్జాల్లో ప్రస్తుత ఎమ్మెల్యే రేగా కాంతారావు కూరుకుపోయారని కాంగ్రెస్ అభ్యర్థి పాయం వెంకటేశ్వర్లు విమర్శలు ఎక్కుపెడుతున్నారు. తన హయాంలోనే నియోజకవర్గంలో చెప్పుకోదగిన అభివృద్ధి జరిగిందని అంటున్నారు. మరోవైపు గడిచిన ఐదేళ్లలో రూ.వందల కోట్లు తీసుకొచ్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశారని బీఆర్‌ఎస్ అభ్యర్థి రేగా కాంతారావు చెబుతున్నారు. సమస్య ఏదైనా సరే నేరుగా సీఎం దగ్గరికి వెళ్లి పరిష్కరించగలిగే సత్తా తన దగ్గర ఉందని అంటున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి ఏ పని చేయాలన్నా ముందుగా ఖమ్మం, అక్కడి నుంచి హైదరాబాద్, ఆ తర్వాత ఢిల్లీకి వెళ్తే తప్ప సాధ్యం కాదని కౌంటర్ ఇస్తున్నారు.

ఇల్లెందులో పోటా పోటీ..

ఇల్లెందు నియోజకవర్గంలో కాంగ్రెస్ – బీఆర్‌ఎస్ అభ్యర్థుల మధ్య పోటాపోటీగా విమర్శల పర్వం సాగుతోంది. గత ఎన్నికల్లో ఓడిపోయిన కోరం కనకయ్యకు బీఆర్‌ఎస్ జిల్లా పరిషత్ చైర్మన్ పదవి ఇచ్చిందని, కానీ అలాంటి పార్టీకి ద్రోహం చేసి కాంగ్రెస్‌లో చేరారని ప్రస్తుత ఎమ్మెల్యే హరిప్రియ విమర్శిస్తున్నారు. అయితే ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం అడ్డాగా నియోజకవర్గంలో రాక్షస పాలన సాగుతోందని, భూదందాలు, అక్రమ కేసుల బనాయింపు, వేధింపులు తగ్గాలంటే హస్తానికి ఓటేయాలని కోరం కనకయ్య ప్రచారం చేస్తున్నారు. ఇక్కడ బరిలో ఉన్న ఇతర అభ్యర్థులు తాము గెలిస్తే ఏం చేస్తామో చెబుతూ ప్రచారంలో సాగిపోతున్నారు.

'గూడెం'లో త్రిముఖ పోరు

జిల్లాలో ఏకైక జనరల్ అసెంబ్లీ స్థానమైన కొత్తగూడెంలో త్రిముఖ పోరు నెలకొంది. భారత రాష్ట్ర సమితి తరఫున సిట్టింగ్ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు బరిలో ఉండగా కాంగ్రెస్, సీపీఐ కూటమి తరఫున కూనంనేని సాంబశివరావు పోటీ చేస్తున్నారు. వీరిద్దరికీ మాజీ ఎమ్మెల్యే జలగం వెంకటరావు నుంచి సవాల్ ఎదురవుతోంది. ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ తరఫున ఆయన బరిలోకి వచ్చారు. గతంలో తాను చేసిన అభివృద్ధి, అందించిన ప్రశాంత పాలనను చూసి ఓటేయ్యాలంటూ పరోక్షంగా సిట్టింగ్ ఎమ్మెల్యే వనమాను ఉద్దేశించి జలగం విమర్శలు ఎక్కుపెడుతున్నారు. అయితే టూరిస్టు ఎమ్మెల్యే వద్దంటూ వనమా దీటుగా సమాధానం ఇస్తున్నారు. తాను ఇక్కడే పుట్టానని, ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటానని చెబుతున్నారు. ఎన్నికల్లో ఓడిపోతే నియోజకవర్గంలో కనిపించని నేతలు అవసరమా? అంటూ ప్రశ్నిస్తున్నారు. ఇక చందాలు, దందాలు లేని పాలన అందిస్తామని సీపీఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావు, ఇతర నాయకులు ప్రచారం చేస్తున్నారు.

భద్రాచలంలో చేసిందేమీ లేదట !

భద్రాచలంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ అభ్యర్థుల కంటే వారి తరఫున ఎన్నికల బాధ్యతలు నిర్వర్తిస్తున్న నేతల మధ్య మాటల యుద్ధం చోటుచేసుకుంటోంది. గత ఐదేళ్లలో ఎమ్మెల్యే పొదెం వీరయ్య చేసిన అభివృద్ధి ఏమీ లేదని ఎమ్మెల్సీ, నియోజకవర్గ ఇన్‌చార్జ్ తాతా మధు కామెంట్ చేశారు. దీనికి ప్రతిగా గత ఐదేళ్లుగా ఇదే నియోజకవర్గాన్ని అంటిపెట్టుకుని ఉంటూ అభివృద్ధికి పాటుపడ్డానని, మీలాగా ఎన్నికలప్పుడే నియోజకవర్గానికి రాలేదని మాజీ ఎమ్మెల్సీ బాలసాని కౌంటర్ ఇస్తున్నారు. ఇటు రాజకీయ వేదికలు, ప్రచారంతో పాటు సోషల్ మీడియాలోనూ జోరుగా ఇరువర్గాల కౌంటర్లతో ఎన్నికల వేడి మరింతగా రాజుకుంటోంది.

'పేట'లో విభిన్నం..

జిల్లాలోని మిగిలిన నాలుగు నియోజకవర్గాలతో పోల్చితే అశ్వారావుపేటలో ప్రచారం భిన్నంగా సాగుతోంది. ఇక్కడ బీఆర్‌ఎస్ తరఫున మెచ్చా నాగేశ్వరరావు, కాంగ్రెస్ నుంచి జారే ఆదినారాయణ పోటీ చేస్తున్నారు. ప్రచారం మొదలై వారం దాటినా ఇంతవరకూ ఒకరిపై ఒకరు ఎలాంటి విమర్శలు, ఆరోపణలు చేసుకోలేదు. రూ. వందల కోట్లతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానని, మరోసారి అవకాశం ఇవ్వాలని మెచ్చా కోరుతుండగా, తాను గిరిజనేతరులకు వ్యతిరేకమంటూ సాగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని, అందురూ తనవారేనని జారే జోరుగా ప్రచారం చేస్తున్నారు.

ఓటరు స్లిప్పుల పంపిణీ ప్రారంభం

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో ఓటరు స్లిప్పుల పంపిణీ ప్రక్రియను శనివారం ప్రారంభించారు. బీఎల్‌ఓ స్థాయి అధికారి ఆధ్వర్యంలో ఓటరు స్లిప్పులు పంపిణీ చేస్తున్నారు. సోమవారం వరకు ఈప్రక్రియ కొనసాగించనున్నారు. ఓటర్లు ఎన్నికల సంఘం ప్రకటించిన 15 రకాల గుర్తింపు కార్డులలో ఏదో ఒక దానిని వెంట తీసుకెళ్లి ఓటుహక్కు వినియోగించుకోవచ్చు. పంపిణీ చేస్తున్న ఓటరు స్లిప్పుల్లో పోలింగ్ కేంద్రం పేరు, ఓటరు జాబితాలో క్రమసంఖ్య ఉంటుంది. ఓటరు స్లిప్పును ఓటు కలిగిన వారికే అందజేస్తున్నారు. ఓటర్లు ఎవరైనాఇంటివద్ద లేకుంటే కుటుంబ సభ్యులకు అందజేసి సంతకం తీసుకుంటున్నారు. స్లిప్పుల పంపిణీ కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా నోడల్ అధికారులను నియమించారు.



ఓటరు స్లిప్పుపై ఉన్న బార్‌కోడ్

ప్రత్యేక బార్‌కోడ్..

ఓటరు స్లిప్పుల్లో ఈసారి నూతనంగా బార్‌కోడ్ ఏర్పాటు చేశారు. దానిని స్కాన్ చేస్తే పోలింగ్ కేంద్రం సమాచారం తెలుస్తుంది. పోలింగ్ కేంద్రం ఎక్కడ ఉందో లొకేషన్‌తో పాటు ఓటరుకు సంబంధించిన అన్ని వివరాలు కనిపిస్తాయి.

అధ్యయనంపై ఆసక్తి పెంచుకోవాలి



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ప్రొఫెసర్లు

అశ్వారావుపేటరూరల్/సూపర్‌బజార్(కొత్తగూడెం): విద్యార్థులు అధ్యయనంపై ఆసక్తి పెంచుకోవాలని వ్యవసాయ కళాశాల ఇన్‌చార్జ్ డీన్ డాక్టర్ ఐవీఎస్ రెడ్డి సూచించారు. కొత్తగూడెం సింగరేణి మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన 73 మంది విద్యార్థినులు బయో డైవర్సిటీ కార్యక్రమంలో భాగంగా శనివారం అశ్వారావుపేటలోని వ్యవసాయ కళాశాలను సందర్శించారు. మొక్కల పెరుగుదలలో తీసుకోవాల్సిన చర్యలు, వివిధ రకాల నూతన సాంకేతిక పరికరాలు, వాటి వినియోగంపై అవగాహనకు ఈ టూర్ ఏర్పాటు చేసినట్లు సింగరేణి కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ శారద, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ జి.మంజుల తెలిపారు. కాగా, వివిధ రకాల తృణధాన్యాలు, చిరుధాన్యాలు, పప్పు ధాన్యాలు, ఆధునిక సాగు గురించి అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ కె.శిరీష, డాక్టర్ డి.స్రవంతి వివరించారు. గ్రీన్‌హౌస్‌లో సాగు, వర్మీకంపోస్టులపై నీలిమ, టి.పావని అవగాహన కల్పించారు. డాక్టర్ ఎస్.మధుసూదన్‌రెడ్డి విత్తనశుద్ధిపై వివరించారు. డాక్టర్ జువ్వా హేమంత్‌కుమార్ కూడా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వృక్ష శాస్త్ర అధ్యాపకులు ఎం.పుష్పలత, బి.సరోజ, సీహెచ్ సుమలత, డాక్టర్ కె.రాజ్యలక్ష్మి, కె.ఉషారాణి పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

రాష్ట్ర విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసాచారి

జూలూరుపాడు: విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేలా ఉపాధ్యాయులు పాటుపడాలని రాష్ట్ర విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్(ఏడీ) ఎస్.శ్రీనివాసాచారి సూచించారు. జూలూరుపాడు మండలంలోని జూలూరుపాడు, కాకర్ల, గుండెపుడి హైస్కూళ్లతోపాటు జూలూరుపాడు ప్రాథమిక పాఠశాలను భద్రాద్రి డీఈఓ వెంకటేశ్వరచారితో కలిసి ఏడీ శుక్రవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్, తొలిమెట్టు, ఉన్నతి, లక్ష్య కార్యక్రమాల అమలుపై సమీక్షించిన ఏడీ... విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. అలాగే, తల్లిదండ్రుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమైన ఏడీ, డీఈఓ మాట్లాడుతూ.. అన్ని సబ్జెక్టులను ఉపాధ్యాయులు బోధించాలని సూచించారు. వెనుకబడిన విద్యార్థులపై దృష్టి సారించి ప్రత్యేక తరగతులు బోధిస్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారులు నాగ రాజశేఖర్, సతీశ్, ఐఈడీ కోఆర్డినేటర్ సైదులు, ఎంఈఓ గుగులోత్ వెంకట్, హెచ్‌ఎంలు లక్ష్మీనర్సయ్య, సంజీవరావు, మంగవేణి, హెచ్‌ఎం గీత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షిస్తున్న ఏడీ శ్రీనివాసాచారి

పాఠశాలల అభివృద్ధికి సహకరించండి

పాల్వంచ : ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తల్లిదండ్రులు సంపూర్ణంగా సహకరించాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకటేశ్వరాచారి కోరారు. స్థానిక గాంధీనగర్‌లోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. తమ పిల్లల చదువుల పట్ల శ్రద్ధ వహించాలని, పాఠశాలల్లో జరిగే ఇలాంటి సమావేశాల్లో పాల్గొని విద్యార్థుల ప్రగతి ఎలా ఉందో ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని పేరెంట్స్‌కు సూచించారు. ఉపాధ్యాయులతో సత్సంబంధాలు ఏర్పర్చుకోవాలని, పాఠశాలలో జరిగే కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని అన్నారు. చదువులో ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ కో ఆర్డినేటర్ ఎ.నాగరాజశేఖర్, ఎస్‌కే.సైదులు, ఎస్.సతీశ్‌కుమార్, ఎంఈఓ శ్రీరామ్మూర్తి, కాంప్లెక్స్ హెచ్‌ఎం పద్మలత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈఓ వెంకటేశ్వరా చారి

నేడు జిల్లాకు కేటీఆర్

- భద్రాచలం, కొత్తగూడెం, ఇల్లెందు, అశ్వారావుపేటలో రోడ్ షోలు
- ఏర్పాట్లు చేస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు
- భారీ జనసమీకరణకు యత్నాలు

ఇల్లెందు/సూపర్‌బజార్(కొత్తగూడెం)/భద్రాచలం : బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు జిల్లాలో ఆదివారం రోడ్ షో నిర్వహించనున్నారు. ఈ మేరకు పార్టీ జిల్లా కమిటీ షెడ్యూల్ విడుదల చేసింది. హైదరాబాద్ నుంచి బయలుదేరి ఉదయం 11 గంటలకు భద్రాచలం చేరుకుంటారు. శ్రీ సీతారామచంద్రస్వామి వారి దర్శనం అనంతరం పట్టణంలో జరిగే రోడ్‌షోలో పాల్గొంటారు. ఆ తర్వాత మధ్యాహ్నం ఒంటి గంటకు ఇల్లెందుకు చేరుకుని బీఆర్‌ఎస్ అభ్యర్థి బానోత్ హరిప్రియ విజయాన్ని కాంక్షిస్తూ రోడ్ షో నిర్వహించనున్నారు. ఆ తర్వాత కార్నర్ మీటింగ్‌లో కేటీఆర్ మాట్లాడుతారు. కేటీఆర్ రాక సందర్భంగా పట్టణంలోని జేకే సింగరేణి స్కూల్ గ్రౌండ్‌లో హెలిప్యాడ్ కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. ఆ తర్వాత 2.30 గంటలకు కొత్తగూడెంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావు విజయాన్ని కాంక్షిస్తూ రోడ్ షో నిర్వహించనున్నారు. సాయంత్రం 4 గంటలకు అశ్వారావుపేటలో జరిగే రోడ్‌షోలో పాల్గొంటారు.



ఇల్లెందులో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, బీఆర్‌ఎస్ శ్రేణులు

కాగా, ఇల్లెందులో కేటీఆర్ రోడ్‌షో సందర్భంగా ట్రాఫిక్ ఇబ్బందులు రాకుండా చర్యలు చేపడుతున్నట్లు సీఐ కరుణాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బస్సులు, ఇతర వాహనాలను బైపాస్ రోడ్ మీదుగా మళ్లిస్తామని, ప్రయాణికులు ఇబ్బంది పడకుండా సింగరేణి బైపాస్ రోడ్‌ను ఉపయోగించుకోవాలని కోరారు.

రోడ్ షో విజయవంతం చేయండి

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఎన్నికల ప్రచారానికి జిల్లాకు వస్తున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పర్యటనను విజయవంతం చేయాలని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర శనివారం ఒక ప్రకటనలో కోరారు. జిల్లాలోని ఇల్లెందు, కొత్తగూడెం, అశ్వారావుపేట, భద్రాచలంలో జరిగే రోడ్ షోలలో కేటీఆర్ పాల్గొంటారని వివరించారు.

ఓట్ల లెక్కింపునకు పటిష్ట ఏర్పాట్లు

- మూడంచెల భద్రతా చర్యలు చేపడుతున్నాం
- సీసీ కెమెరాల ద్వారా ప్రత్యేక నిఘా
- జిల్లా ఎన్నికల అధికారి ప్రియాంక ఆల

పాల్వంచ : డిసెంబర్ 3వ తేదీన పాల్వంచ అనుబోస్ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగే అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు పటిష్ట ఏర్పాట్లు చేయనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రియాంక ఆల తెలిపారు. ఓట్ల లెక్కింపు ఏర్పాట్లపై శనివారం ఆమె పలు శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈనెల 30న పోలింగ్ ప్రక్రియ ముగిసిన వెంటనే అత్యంత భద్రత మధ్య ఈవీఎంలను భద్రపర్చాలని, స్ట్రాంగ్ రూంలకు విద్యుత్ సరఫరా నిలిపివేయాలని సూచించారు. పటిష్ట రక్షణ చర్యల్లో భాగంగా స్ట్రాంగ్ రూంల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు రికార్డ్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ఏర్పాట్ల పర్యవేక్షణకు ఆ శాఖ ఎస్ఈని నోడల్ అధికారిగా నియమించామని తెలిపారు. లెక్కింపు విధులు నిర్వహించే సిబ్బందికి గుర్తింపు కార్డులు జారీ చేయాలని, అవి లేకుంటే కేంద్రంలోకి అనుమతించేది లేదని స్పష్టం చేశారు. మూడంచెల భద్రత చర్యల్లో భాగంగా బారికేడింగ్ ఏర్పాటు చేయాలన్నారు. ఇంటర్నెట్‌కు ఇబ్బంది లేకుండా హైస్పీడ్ సేవలు ఉండాలన్నారు. కౌంటింగ్ పరిసరాలు సైతం పరిశుభ్రంగా ఉంచాలని, సురక్షిత తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యాలు, పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈనెల 25 నుంచి కళాశాలను పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకుంటామని చెప్పారు. ఓట్ల లెక్కింపు విధుల్లో పాల్గొనే సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని ఆర్‌ఓలకు సూచించారు. లెక్కింపు ప్రక్రియ ముగిసే వరకు విధులు నిర్వహించే సిబ్బంది ఆవరణ దాటి వెళ్లడం కుదరదని చెప్పారు. ఈవీఎంలు లెక్కింపునకు తీసుకొచ్చే సిబ్బంది ఆయా నియోజకవర్గాల వారీగా డ్రెస్‌కోడ్ పాటించాలన్నారు. ఎస్పీ వినీత్ మాట్లాడుతూ స్థానిక పోలీసులు, కేంద్ర బలగాలతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కేంద్రంలో 80 సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. రద్దీ నియంత్రణకు బారికేడ్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. సమావేశంలో రిటర్నింగ్ అధికారులు ప్రతీక్ జైన్, రాంబాబు, శిరీష, మంగీలాల్, కార్తీక్, ఆర్‌అండ్‌బీ ఈఈ భీమ్లా, కుసుమకుమారి, ఎ.స్వామి, డీఎస్పీ వెంకటేశ్, సీఐ వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎన్నికల అధికారి ప్రియాంక ఆల, పక్కన ఎస్పీ వినీత్ తదితరులు

సమష్టి కృషితోనే సంస్థ అభివృద్ధి



అవార్డులు అందుకున్న ఉద్యోగులతో ఆర్‌ఎం వెంకన్న, అధికారులు

- ఆర్టీసీ ఎదుగుదలలో డ్రైవర్లు, కండక్టర్లే కీలకం
- ఖమ్మం రీజినల్ మేనేజర్ వెంకన్న

సత్తుపల్లిరూరల్: ఉద్యోగుల సమష్టి కృషితోనే సంస్థ అభివృద్ధి సాధ్యమవుతుందని ఆర్టీసీ ఖమ్మం రీజినల్ మేనేజర్ సీహెచ్.వెంకన్న తెలిపారు. సత్తుపల్లి ఆర్టీసీ డిపోలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ఉద్యోగులకు రీజినల్ స్థాయి ప్రగతి చక్ర అవార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆర్‌ఎం మాట్లాడుతూ.. ఆర్టీసీ అభివృద్ధికి డ్రైవర్లు, కండక్టర్లే కీలకమని తెలిపారు. ఉద్యోగులు బాధ్యతతో వ్యవహరిస్తే ఆదాయం పెరుగుతుందని చెప్పారు.

25మందికి అవార్డులు..

ఖమ్మం రీజినల్ పరిధిలోని ఏడు డిపోల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పది మంది డ్రైవర్లు, ఏడుగురు కండక్టర్లు, ముగ్గురు టిమ్స్ డ్రైవర్లు, ఐదు అద్దె బస్సుల డ్రైవర్లు, ముగ్గురు మెకానిక్‌లను ఆర్‌ఎం సన్మానించారు. అదేవిధంగా ఉత్తమ బస్ స్టేషన్‌గా ఎంపికైన ఖమ్మం పాత బస్టాండ్ డిపో మేనేజర్‌ను సత్కరించారు. రీజియన్ నుంచి 25 మంది అవార్డులకు ఎంపిక కావడం సంతోషంగా ఉందని తెలిపారు. ప్రగతిచక్ర అవార్డులు పొందిన ఉద్యోగులను స్ఫూర్తిగా తీసుకొని మిగతా ఉద్యోగులు సంస్థ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కాగా, త్వరలోనే కొత్తగూడెం బస్‌స్టేషన్‌లో ఆర్టీసీ డిస్పెన్సరీ ఏర్పాటు చేస్తామని ఆర్‌ఎం వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి, ఖమ్మం, భద్రాచలం, మణుగూరు డిపో మేనేజర్లు యు.రాజ్యలక్ష్మి, శ్రీనివాసరావు, రామారావు, స్వామి, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఓట్లు అడిగేందుకు ఎలా వచ్చారు?

- సమస్యలు ఎందుకు పరిష్కరించడం లేదు..
- పులిగుండాలలో ఎమ్మెల్సీ తాతా మధు, బీఆర్‌ఎస్ నేతలను నిలదీసిన గ్రామస్తులు

చర్ల: ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని పులిగుండాలకు బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ తాతా మధు వెళ్లగా నిరసన ఎదురైంది. పదేళ్ల పాటు గ్రామాన్ని పట్టించుకోకుండా.. ఇక్కడి సమస్యలు తీర్చకుండా ఇప్పుడు ఓట్లు అడిగేందుకు ఎలా వచ్చారని గ్రామస్తులు నిలదీశారు. గ్రామానికి మిషన్ భగీరథ నీళ్లు ఎందుకు ఇవ్వరని, ఎరువులు, విత్తనాలకు సబ్సిడీలు ఏవని, వ్యవసాయ యంత్ర పరికరాలకు సబ్సిడీలు ఏవని, ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు ఉద్యోగాలు ఏవని ప్రశ్నించారు. డబుల్ బెడ్‌రూం, గృహలక్ష్మి పథకం క్రింద తమ గ్రామానికి ఎన్ని ఇళ్లు నిర్మించి ఇచ్చారంటూ ఎదురుతిరిగారు. పట్టాలిస్తున్నాం, రైతుబంధు ఇస్తున్నాం అని ఎమ్మెల్సీ తాతా మధు చెబుతుండగానే.. వందలాది ఎకరాల భూములున్న మీకు రైతుబంధు ఇస్తున్నారని ఓ యువకుడు అన్నాడు. దీంతో 'నీకు రైతుబంధు వద్దా ! వద్దంటే చెప్పు ఇప్పుడే చెబుతా నీకు రైతుబంధు వద్దని'అనడంతో గ్రామస్తులు రైతుబంధును మీరేలా నిలిపి వేయిస్తారంటూ ప్రశ్నించారు. ఇలా సుమారు గంటన్నర పాటు గ్రామస్తులకు బీఆర్‌ఎస్ నాయకులకు మధ్య వాగ్వాదం జరిగింది. గ్రామస్తులకు ఎంతగా సర్ది చెప్పాలని చూసినా వారు ససేమిరా అనడంతో బీఆర్‌ఎస్ నేతలు మిన్నకుండిపోయారు. ఈ క్రమంలో దేవరాపల్లి (కుదునూరు) ఎంపీటీసీ సభ్యుడు కుంజా నాగేశ్వరరావు మాట్లాడేందుకు యత్నించగా.. ఎంపీటీసీగా గెలిపిస్తే గ్రామానికి ఏం చేశావని, నాడు కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిపిస్తే నేడు బీఆర్‌ఎస్‌లో చేరావని.. ఇక నీ సేవలు చాలంటూ గ్రామస్తులు తిరగబడడంతో నాగేశ్వరరావు సైతం మౌనం దాల్చాడు. దీంతో ఎమ్మెల్సీ తాతా మధుతో పాటు ఎంపీటీసీ కుంజా నాగేశ్వరరావు, బీఆర్‌ఎస్ నాయకులు సాగి శ్రీనివాసరాజు, నాతాని రాము, ఐనవోల్ జగదీశ్, రమేశ్‌గౌడ్, మానెం రామకృష్ణ ప్రచారం నిర్వహించకుండానే వెనుదిరిగారు.



ఎమ్మెల్సీ తాతా మధును నిలదీస్తున్న ప్రజలు

క్లుప్తంగా

నగదు సీజ్..


నగదును సీజ్ చేస్తున్న అధికారులు

దమ్మపేట: ఎన్నికల నిబంధనల మేరకు చేస్తున్న తనిఖీల్లో, ఆధారాలు లేకుండా తరలిస్తున్న నగదును ఎఫ్ఎస్ టీం ఆధ్వర్యంలో పోలీసులు సీజ్ చేశారు. శనివారం మండలంలోని మందలపల్లి చెక్‌పోస్ట్ వద్ద రెండు కార్లలో తరలిస్తున్న రూ.3,05,000 నగదును గుర్తించి, ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేశామని ఎఫ్ఎస్ టీం అధికారి కృష్ణ తెలిపారు.

అడిషనల్ సెషన్స్ కోర్టు ఏర్పాటు చేయాలి


వినతిపత్రం అందిస్తున్న కృష్ణమాచారి

భద్రాచలంఅర్బన్: భద్రాచలంలో అడిషనల్ సెషన్స్ కోర్టు ఏర్పాటు చేయాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భీమపాక నగేశ్‌కు శనివారం న్యాయవాది పీవీ కృష్ణమాచారి వినతి పత్రం సమర్పించారు. భద్రాచలం రెవెన్యూ డివిజన్‌లో కేవలం మొదటి తరగతి న్యాయస్థానం మాత్రమే ఉందని, ఈ ప్రాంతంలో ఎక్కువశాతం గిరిజనులే ఉన్నందున చర్ల, దుమ్ముగూడెం, బయ్యారం, మణుగూరు మండలాల నుంచి కొత్తగూడెం వెళ్లడం కక్షిదారులకు దూరభారం అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాది అక్తర్, సనాభేగం పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రచార ప్లానింగ్ కమిటీ కన్వీనర్‌గా రామ్మూర్తి


రామూర్తినాయక్

ఖమ్మంరూరల్: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రచార ప్లానింగ్ కమిటీ కన్వీనర్‌గా ధరావత్ రామ్మూర్తినాయక్ నియమితులయ్యారు. గతంలో కార్పొరేటర్‌గా పనిచేసిన ఆయన వైరా నుంచి పార్టీ టికెట్ ఆశించినా ఫలితం దక్కలేదు. ఈమేరకు ప్రచార ప్లానింగ్ కమిటీ కన్వీనర్‌గా నియమిస్తూ ఏఐసీసీ నాయకుడు కేసీ.వేణుగోపాల్ శనివారం ప్రకటన విడుదల చేశారు.

ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రానికి నేడు పాదయాత్ర

భద్రాచలంటౌన్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన భద్రాద్రి నుంచి ఏపీలోని నరసాపురం మండలంలో గల శ్రీ ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రానికి అయ్యప్ప స్వాములు మహా పాదయాత్ర చేయనున్నట్లు గురుస్వామి రెల్లి తాతారావు స్వామి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. భద్రాద్రి అయ్యప్ప భజన బృందం వారి ఆధ్వర్యంలో ఆదివారం పాదయాత్ర ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల స్వాములు పాదయాత్రలో పాల్గొనాలని కోరారు.

యువతి అదృశ్యం

టేకులపల్లి: డిగ్రీ విద్యార్థిని కనిపించకుండా పోయిన ఘటన మండలంలో శనివారం వెలుగుచూసింది. టేకులపల్లి ఎస్ఐ రమణారెడ్డి కథనం ప్రకారం.. మద్రాస్‌తండా పంచాయతీ కొండంగులబోడు గ్రామానికి చెందిన యువతి కొత్తగూడెంలోని ఓ కళాశాలలో డిగ్రీ చదువుతోంది. గత గురువారం కూడా కాలేజీకి వెళ్తున్నాని ఇంట్లో చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. బంధు, మిత్రుల వద్ద వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కాంగ్రెస్ ఫ్లెక్సీ చింపివేత

కామేపల్లి: ఇల్లెందు కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోరం కనకయ్య ప్రచార వాహన ఫ్లెక్సీని బీఆర్ఎస్ కార్యకర్త చింపేశాడు. మండలంలోని పింజరమడుగులో బీఆర్ఎస్ అభ్యర్థి బానోత్ హరిప్రియ ఎన్నికల ప్రచారం చేస్తుండగా, కాంగ్రెస్ ప్రచార వాహనం వచ్చింది. దీంతో టేకులపల్లి మండలానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త బానోత్ మోహన్ కాంగ్రెస్ వాహనంపై ఉన్న ఫ్లెక్సీని చింపేశాడు. ఈ అంశంపై కాంగ్రెస్ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, బీఆర్ఎస్ నాయకులు తిరిగి ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తామని చెప్పడంతో ఫిర్యాదు వెనక్కి తీసుకున్నారు.

యువకుడి ఆత్మహత్య

పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్న వైనం

నేలకొండపల్లి: మండలంలోని కోరట్లగూడెంకు చెందిన ఓ యువకుడు పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కోరట్లగూడెంకు చెందిన వి.గోపి(28) శనివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయాన ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నారు. అనంతరం ఆయన అరుస్తుండడమే కాక మంటలు రావడంతో స్థానికులు చేరుకుని చూసేసరికి పూర్తిగా కాలిపోయాడు. కుటుంబ కలహాలతోనే ఆయన ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. కాగా, తల్లి సరుకులు తెచ్చేందుకు షాపుకు వెళ్లొచ్చే సరికి కొడుకు విగతజీవిగా మారడంతో బోరున విలపించింది.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.12,196

జయం మనదే !



నేడు వరల్డ్ కప్ క్రికెట్ ఫైనల్స్
- విజయం భారత్‌దే అంటున్న అభిమానులు
- పరాజయం ఎరగని జట్టు కప్ సాధిస్తుందని ధీమా

ఖమ్మంస్పోర్ట్స్: ఈ వరల్డ్ కప్ క్రికెట్ మ్యాచ్‌ల్లో భారత జట్టు అప్రతిహతంగా విజయ పరంపర కొనసాగిస్తోంది. ఆడిన పది మ్యాచ్‌ల్లోనూ ప్రత్యర్థులకు చుక్కలు చూపించి విజయాలు కైవసం చేసుకుంది. సెమీఫైనల్‌లోనూ సత్తా చాటడంపై అభిమానుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ప్రధానంగా బ్యాట్స్‌మెన్లతో పాటు బౌలర్లు కూడా ప్రతిభకు తగిన విధంగా రాణిస్తుండడంతో భారత్‌కు ఇప్పటివరకు ఎదురులేకుండా పోయింది. అయితే, ఆదివారం ఫైనల్స్ జరగనుండడం, ప్రత్యర్థి ఆస్ట్రేలియా కావడంతో అభిమానులు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. అయినప్పటికీ భారత జట్టులో ఏడో నంబర్ వరకు బ్యాట్‌మెన్ సత్తా చాటుతుండడం కలిసొస్తుందనే నమ్మకంతో ఉన్నారు. మరోపక్క షమి వంటి బౌలర్లు.. ఫీల్డింగ్‌లో చురుకుదనం కలగలిపి కప్ సాధించడం ఖాయమనే ధీమా వ్యక్తం చేస్తున్నారు.

ప్రత్యేక ఏర్పాట్లు

వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్ భారత్ – ఆస్ట్రేలియా నడుమ ఆదివారం జరగనుంది. ఈ మ్యాచ్ కోసం అభిమానులు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. ఆదివారం సెలవు కావడంతో ఇళ్లలోనే మ్యాచ్ చూసేందుకు పలువురు సిద్ధమయ్యారు. మరికొందరు మాత్రం స్నేహితులతో కలిసి మ్యాచ్ చూసేలా ఏర్పాట్లు చేసుకున్నారు. ఇంకొందరు హోటళ్లలో గదులు బుక్ చేసుకున్నట్లు తెలుస్తోంది. ఏదిఏమైనా వరల్డ్ కప్‌లో మొదటి నుంచి పరాజయం ఎరగకుండా దూసుకెళ్తున్న భారత జట్టు ఫైనల్స్‌లోనూ అదే స్థాయి సత్తా చాటి కప్ గెలుచుకోవాలని అభిమానులంతా ఆశిస్తున్నారు.

బ్యాటింగ్ ఆర్డర్ బాగుంది



జట్టు బ్యాటింగ్ ఆర్డర్ బాగుంది. అందరూ ఫైనల్స్‌లో ఇదే తరహా ఆటతీరు కనబరిస్తే సునాయసనంగా కప్ మన సొంతమవుతుంది. ఇప్పటి వరకు పది మ్యాచ్‌ల్లో అందరూ సమష్టిగా రాణించారు. అదేస్థాయిలో ఆడితే మూడోసారి మనం కప్ సాధించడం ఖాయం.

– టి.సునీల్‌కుమార్‌రెడ్డి, డీవైఎస్ఓ

ఆస్ట్రేలియా బ్యాట్స్‌మెన్లను నిలువరించాలి



ఆస్ట్రేలియా బ్యాట్స్‌మెన్లను నిలువరిస్తే భారత్ విజయావకాశాలు మెరుగవుతాయి. భారత బౌలర్లు సమష్టిగా రాణించాలి. ఏదిఏమైనా 1983, 2011 మాదిరిగానే ఈ ఏడాది కూడా మన జట్టు కప్ సాధిస్తామని నమ్మకముంది. ప్రధానంగా ఒత్తిడి లేకపోవడం మన జట్టుకు కలిసొస్తుంది.

– ఎం.డీ.మసూద్ పాషా, క్రికెట్ అసోసియేషన్ జిల్లా కోఆర్డినేటర్

టాసే కీలకం..



భారత జట్టు ఇప్పటివరకు అన్ని మ్యాచ్‌ల్లో అద్భుతమైన ఆటతీరు ప్రదర్శించింది. ఇదే తరహా ఆటతీరు ఫైనల్స్‌లో కొనసాగిస్తే కప్ సాధించడం ఖాయం. టాస్ విజయమే భారత్ బ్యాట్స్‌మెన్‌లు, బౌలర్లకు కీలకం కానుంది. టాస్ గెలిస్తే కప్ కూడా సాధించినట్లే.

– జోజీచాకో, సీనియర్ క్రికెటర్

బౌలర్లు విఫలం కావొద్దు...



ఆస్ట్రేలియా జట్టును తక్కువగా చూడొద్దు. మన బౌలర్లు విఫలమైతే కష్టాలు ఎదురవుతాయి. అదే బౌలర్లు సత్తా చాటితే మ్యాచ్ వన్‌సైడ్ అవుతుంది. ప్రధానంగా బౌలర్లపైనే విజయం ఆధారపడి ఉంది. ముందుగా భారత్ బ్యాటింగ్ తీసుకుంటే మంచిదని నా అభిప్రాయం.

– ఎం.డీ.మతిన్, క్రికెట్ కోచ్

వరల్డ్‌కప్ మనదే..



భారత్ ఆడిన ప్రతీ మ్యాచ్‌లో అప్రతిహతమైన విజయాన్ని అందుకుంది. ఇదేరీతిలో ఫైనల్స్‌లోనూ సత్తాచాటి కప్ అందుకునేందుకు అనుకూలమైన పరిస్థితులున్నాయి. బ్యాటింగ్, బౌలింగ్‌లో అందరూ ప్రతిభ కనబరుస్తున్నారు. అందుకే మనం కప్ సాధించడం ఖాయం.

– డాక్టర్ బి.వెంకన్న, సీనియర్ పీడీ

మిడిల్ ఆర్డర్‌పైనే ఆశలు



మిడిల్ ఆర్డర్‌లో కోహ్లి బ్యాట్స్‌మెన్‌గా వస్తే సెంచరీ సాధించడం ఖాయం. ఆస్ట్రేలియాను ఓడించి కప్ సాధించడం పెద్ద కష్టమేమీ కాదు. ప్రత్యర్థి బ్యాట్స్‌మెన్లను మన బౌలర్లు నిలువరించే అవకాశముంది. కనీసం 50 పరుగుల తేడాతో కప్ సాధిస్తుందనే ఆశిస్తున్నాను.

– ఎం.డీ.ఫారుఖ్, సీనియర్ క్రికెటర్

ఫీల్డింగ్‌లోనూ రాణిస్తున్నారు..



మన జట్టులో అందరూ ఫీల్డింగ్‌లోనూ రాణిస్తున్నారు. ఫైనల్‌లో ప్రత్యర్థుల బాల్స్‌ను ఆపగలిగితే విజయం మనదే అవుతుంది. మ్యాచ్ ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్నాం. ఆదివారం పనులన్నీ వాయిదా వేసుకుని మ్యాచ్ చూడాలని కుటుంబమంతా నిర్ణయించుకున్నాం.

– ఏనిసెట్టి శ్రీనివాసరావు, ప్రైవేట్ అధ్యాపకుడు

గతంలో ఎన్నడూ చూడని జట్టు



నేను 40 ఏళ్లుగా క్రికెట్ చూస్తున్నా. కానీ ఇప్పటి మాదిరి జట్టు ఎప్పుడూ లేదు. జట్టులోని ప్రతీ ఆటగాడు రాణిస్తుండడం శుభపరిణామం. బ్యాటింగ్, బౌలింగ్‌ల్లో ఏది ఎంచుకున్నా వంద శాతం సత్తా చాటుతున్నారు. మన జట్టుకు ప్రపంచ కప్ గెలిచే అన్ని అర్హతలు ఉన్నాయి.

– ఊటుకూరు సూర్యనారాయణ, ఎల్ఐసీ ఏజెంట్

ఇండియా గెలవాలని రామాలయంలో పూజలు


పూజలు చేసిన నెహ్రూ కప్ ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు

భద్రాచలంటౌన్: అహ్మదాబాద్ వేదికగా ఆదివారం జరిగే క్రికెట్ ప్రపంచ కప్ తుదిపోరులో ఇండియా విజయం సాధించాలని కోరుతూ భద్రాచలం నెహ్రూ కప్ ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు శనివారం రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నెహ్రూ కప్ వ్యవస్థాపకుడు తోటమళ్ల బాలయోగి మాట్లాడుతూ.. భాతర జట్టు ఆస్ట్రేలియాపై అఖండ విజయం సాధించి, మూడో సారి వరల్డ్ కప్ సాధించాలని రామయ్యకు 11 కొబ్బరికాయలు కొడతామని మొక్కినట్లు తెలిపారు. కార్యక్రమంలో మడిపల్లి నాగార్జున, గుమ్మలూరి శ్రీనివాసరావు, కుంచాల సదానందం (సిద్ధు), ప్రసాద్, రేపాక రామారావు, పాలెపు రామకృష్ణ, ఆదినారాయణ, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

● ఆల్ ది బెస్ట్.. ఇండియా!


ఇండియా అక్షరాల రూపంలో విద్యార్థులు

వరల్డ్ కప్ టోర్నీలో భాగంగా ఆదివారం జరిగే ఫైనల్స్‌లో భారత జట్టు ఆస్ట్రేలియాతో తలపడనుంది. ఈ సందర్భంగా ఇండియా జట్టు విజయం సాధించాలని మధిరలోని భరత్ విద్యాసంస్థల విద్యార్థులు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పాఠశాల అధినేత శీలం వెంకటరెడ్డి ఆధ్వర్యాన శనివారం విద్యార్థులు 'ఇండియా'అక్షరాల రూపంలో కూర్చుని శుభాకాంక్షలు తెలిపారు. ప్రిన్సిపాల్ జింకల కోటేశ్వరరావు, డీన్ రవీందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఉమ, స్రవంతి, నాగరాజు, పాషా, అజీం, రమేశ్, గణేశ్, శశికళ, హెప్సిబా, విజయ్‌భాస్కర్ పాల్గొన్నారు.

– మధిర

పోలీసుల అదుపులో 'గుప్త నిధుల' ముఠా?

దుమ్ముగూడెం: మండలంలోని ఆర్లగూడెం – అడవి రామారం గ్రామాల మధ్య గల అటవీప్రాంతంలో గుప్త నిధుల కోసం తావ్వేందుకు ప్రయత్నించిన వ్యక్తులను ఆర్లగూడెం గ్రామస్థులు అదుపులోకి తీసుకుని పోలీసులకు అప్పగించినట్టు తెలిసింది. శనివారం రాత్రి రెండు గ్రామాల మధ్య గల అటవీ ప్రాంతంలో పసుపు, కుంకుమ ఇతర పూజా సామగ్రితో అటవీ ప్రాంతంలో తచ్చాడుతున్న కొంతమంది వ్యక్తులను గుర్తించిన ఆర్లగూడెం గ్రామస్తులు మిగతా వారికి సమాచారం అందించారు. దీంతో గ్రామస్తులంతా కలిసి ఘటనా స్థలానికి వెళ్లగా కొందరు బైక్‌లపై పారిపోయారు. నలుగురు వ్యక్తులు దొరకడంతో వారిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా భద్రాచలం – పాల్వంచకు చెందిన వ్యక్తులుగా చెప్పడంతోపాటు పొంతన లేని సమాధానాలు చెప్పడంతో గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులు నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

బాస్కెట్‌బాల్, టగ్ ఆఫ్ వార్ జట్ల ఎంపిక


టగ్ ఆఫ్ వార్ బాలికల జట్టుతో అధికారులు

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన శనివారం ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఉమ్మడి జిల్లా స్థాయి బాలబాలికల అండర్–17 బాస్కెట్‌బాల్, అండర్–14, 17 టగ్ ఆఫ్ వార్ జట్ల ఎంపిక చేశారు. ఈ ఎంపిక పోటీలకు రెండు జిల్లాల నుంచి 190 మంది క్రీడాకారులు హాజరయ్యారు. పోటీలను పీఈటీలు కృష్ణమూర్తి, పీ.వీ.రమణ, కె.రామారావు, షఫీక్ అహ్మద్, రంజాన్, సైదేశ్వర్‌రావు, ఖుద్దూస్, రాజకుమారి, రవి పర్యవేక్షించగా.. రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా జట్ల వివరాలను జిల్లా పాఠశాలల క్రీడా కార్యదర్శి కె.నర్సింహామూర్తి ప్రకటించారు. బాలుర అండర్–17 బాస్కెట్‌బాల్ జట్టుకు ఆర్.దివాకర్, ఎస్.జాయిదీప్, అకిబోయాం, సిద్దు, అబిద్, వినయ్‌కుమార్, వెంకట్‌సాయి, లోకేశ్, ఖాదర్, సోహెల్, వెంకటరామ సత్యసాయికిరణ్, నవ్యనాథ్ ఎంపికకాగా, బాలికల జట్టుకు భాను స్పందన, రింశా, సాగరిక, మౌనిక, అఖిల, మంజుల, ధాత్రి, తియ, రూపా, ఆరిఫా, రిఫత్ జైన్ ఎంపకయ్యారని తెలిపారు. అలాగే, టగ్ ఆఫ్ వార్ అండర్– 14 బాలురు జట్టుకు భాను, శ్రవణ్, బి.మహేశ్, భార్గవ్, మోబిన్, తరుణ్, శ్రీనాథ్, అభిలాష, చైతన్య, అభిలాశ్, శివశంకర్, శరణ్‌సాయి, రాంచరణ్, బాలికల జట్టుకు దీక్షిత, కార్తీక, భవాని, మాధురి, సుప్రియ, మధు శ్రీ,అమూల్య, సంజన, ఉష, కల్యాణి, మేఘన, మనీషా ఎంపికయ్యారు. ఇక అండర్– 17 బాలుర జట్టులో తరుణ్, గణేశ్, మహేశ్, చరణ్, ప్రదీప్, వీరభద్రం, భాను ప్రసాద్, అరవింద్, చరణ్, సాయి మణికంఠ, వెంకటేశ్, ఫరీద్, మణికంఠ, జశ్వంత్, బాలికల జట్టులో మనీషా, భార్గవి, మోక్షిత, వైష్ణవి, ఝాన్సీ శృతి, భవాని, పూజిత, అఖిల, శ్రీలక్ష్మీదుర్గ, హర్షిత, మౌనిక, అనుష్క ఎంపికయ్యారని వెల్లడించారు.

వధకు తరలిస్తున్న 150 పశువులు స్వాధీనం


గోవులను తరలిస్తున్న వాహనాలు


మృతి చెందిన పశువులు

ఖమ్మంఅర్బన్/కల్లూరు: నోరు లేని జీవాలను వాహనాల్లో పరిమితికి మించి కుక్కి తీసుకెళ్తుండగా అధికారులు అడ్డుకున్నారు. అయితే, తొక్కిసలాటలో అప్పటికే ఐదు పశువులు మృత్యువాత పడ్డాయి. వివరాలిలా.. ఒడిశా నుంచి మూడు వాహనాల్లో 150 పశువులను తరలిస్తుండగా శుక్రవారం రాత్రి కల్లూరు ఎస్సై పి.రఘు ఆధ్వర్యాన చేపట్టిన తనిఖీల్లో గుర్తించారు. అయితే, వాహనదారుల వద్ద ఎలాంటి పత్రాలు లేకపోవడంతో గోవధ కోసం తరలిస్తున్నట్లు తెలియడంతో స్వాధీనం చేసుకున్నారు. అనంతరం శనివారం ఉదయం ఖమ్మం టేకులపల్లిలోని శ్రీవెంకటేశ్వర గోశాలకు వాహనాలను తీసుకొచ్చారు. అయితే, వాహనాల్లో పరిమితి మించి పశువులను ఎక్కించి నీరు, గ్రాసం ఇవ్వకుండా రవాణా చేయడంతో గోశాలలో దించుతున్న క్రమంలో ఐదు పశువులు మృతి చెందినట్లు నిర్వాహకులు తెలిపారు. కాగా, మృతి చెందిన పశువులను అదే లారీల్లో తీసుకెళ్లగా.. గాయపడిన వాటికి గోశాలలో పశువైద్యులతో చికిత్స చేయించారు.

ఏడు కేజీల గంజాయి స్వాధీనం


స్వాధీనం చేసుకున్న గంజాయితో ఎక్సైజ్ పోలీసులు

మధిర: మధిర రైల్వేస్టేషన్‌లో శనివారం చేపట్టిన తనిఖీల్లో ఎక్సైజ్ అధికారులు ఏడు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఉదయం కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలు వచ్చే సమయాన ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎం.ప్రసాద్ ఆధ్వర్యంలో తనిఖీలు చేయగా, స్టేషన్ సమీపాన ట్రాక్ పక్కన తెల్లని ప్లాస్టిక్ మూట కనిపించింది. దీన్ని పరిశీలించగా రూ.1.70లక్షల విలువైన ఏడు కేజీల గంజాయి ఉండడంతో సీజ్ చేశారు. అలాగే, మధిర ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో తనిఖీ చేసిన ఉద్యోగులు ఇద్దరి నుంచి 28.8 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. తనిఖీల్లో ఎస్సైలు జి.చంద్రశేఖర్, ఎం.శార్వాణి, సిబ్బంది సీహెచ్.గోపి, షేక్ రియాజ్, గంగ, జ్యోతి పాల్గొన్నారు.

మానవతా ధర్మమే నిజమైన భక్తిమార్గం

ఖమ్మంగాంధీచౌక్: ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడాన్ని భక్తిమార్గంగా భావించాలని గజల్ గాయకుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్ అన్నారు. ఖమ్మంలోని ఈశ్వరాంబ వృద్ధాశ్రమం ప్రాంగణంలో శనివారం రాత్రి నిర్వహించిన భగవాన్ శ్రీ సత్యసాయి బాబా జయంతి వేడుకల్లో పాల్గొన్న సందర్భంగా ఆయన మాట్లాడారు. సత్య సాయిబాబా విద్యాసంస్థలు, ఆస్పత్రులు నిర్మించడమే కాక అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. ఆతర్వాత ఆయన అమ్మ, నాన్న, ప్రకృతి, పాఠశాల, భార్యాభర్తల బంధం, ఆప్యాయతలు, వృద్ధాప్యం తదితర అంశాలపై పాడిన గేయాలు అలరించాయి. శ్రీ సత్యసేవా సమితి కన్వీనర్ ఆలస్యం నర్సింహారావుతో పాటు గాయత్రి, లెనిన్ శ్రీనివాస్, నాళ్ల భానుచందర్, కేవీ.చారి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని పశువులు మృతి


ప్రమాదంలో మృతి చెందిన గేదెలు

అశ్వారావుపేటరూరల్: ఆర్టీసీ బస్సు ఢీకొని మూడు గేదెలు, రెండు ఆవులు మృతి చెందాయి. ఎస్ఐ శ్రీకాంత్ కథనం ప్రకారం.. ఏపీలోని ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ప్రయాణికులతో భద్రాచలం నుంచి అశ్వారావుపేట వైపు వస్తోంది. ఈ క్రమంలో గ్రామ శివారులోగల రైస్‌మిల్ మూలమలుపు వద్ద వేగంగా వచ్చి అదుపుతప్పి పశువులను ఢీకొట్టింది. అశ్వారావుపేటకు చెందిన రైతు చిన్నంశెట్టి నరసింహారావుకు చెందిన రూ.2.40 లక్షల విలువ చేసే మూడు పాడి గేదెలు, రూ.లక్ష విలువ చేసే రెండు ఆవులు అక్కడికక్కడే మృతి చెందాయి. రైతు నరసింహారావు ఫిర్యాదుపై డ్రైవర్ బోయినపల్లి సత్యనారాయణపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. కాగా, పశువులన్నీ ఒకేసారి మృతిచెందడంతో బాధితుడు లబోదిబోమంటున్నాడు.

ప్రభుత్వ ఆస్పత్రిలో పాము కలకలం


బంధించిన పాముతో షౌకత్ అలీ

బూర్గంపాడు: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో శనివారం పాము కలకలం సృష్టించింది. ఆస్పత్రి ఆవరణలో సుమారు 9 అడుగుల పొడవున్న పాము కనిపించడంతో ఆస్పత్రి సిబ్బంది,రోగులు భయభ్రాంతులకు గురయ్యారు. పాములు పట్టే యువకుడు, వార్డు సభ్యుడు షౌకత్ అలీకి సమాచారమివ్వడంతో.. అక్కడకు చేరుకుని పామును పట్టి అటవీ ప్రాంతంలో వదిలాడు. దీంతో ఆస్పత్రి సిబ్బంది, రోగులు ఊపిరి పీల్చుకున్నారు.

సాక్షి సండే క్లాసిఫైడ్స్

Education

DIRECT FINAL YEAR
■ INTER, GNM, B.Sc, MLT, NURSING, OPTOMETRY, Post Basic, BPT, MPT, BHMS, BNYS, Ph.D(all) (కొన్ని సీట్లు మాత్రమే) సెల్: 7013088197. [W-1229311]

Real Estate

■ ఖమ్మం తక్కువ ధరల్లో ఇల్లు కట్టించి ఇవ్వబడును. 100% వాస్తు, 100% క్వాలిటీతో మీరు అనుకున్న ఇల్లు అప్పగించగలరు. బ్యాంక్ లోన్ సౌకర్యం. సంప్ర. 91007 57031 [M-1221918]

PLOT FOR SALE
■ గణేష్ రియల్ ఎస్టేట్ ఖమ్మం DTCP వెంచర్‌లో ఓపెన్ ప్లాట్లు అతి తక్కువ ధరల్లో అమ్మకానికి కలవు. మార్కెటింగ్ ఏజెంట్స్, టెలికాలర్స్ కావలెను. సెల్: 96667 77775/2, 86884 55176 [M-10802]
■ ఖమ్మం పట్టణం సమీపంలో DTCP, SUDA, Rera అన్ని అనుమతులతో కూడిన ప్లాట్స్ తక్కువ ధరలలో కలవు. భారతి రియల్ ఎస్టేట్స్ అండ్ డెవలపర్స్. సంప్ర. 91775 54110, 94401 01408. [M-2790]
■ ఖమ్మం పట్టణం ఖానాపురం హవేలి, విజయనగర్ కాలనీలో ఇళ్ల మధ్య ఉన్న 310 గజాల ఓపెన్ ప్లాట్ అమ్మబడును. వివరాలకు సంప్ర. 94419 15432. [M-1221869]

HOUSE FOR SALE
■ ఖమ్మం చెరువు బజార్ Park వెనుక 222 చ॥గ॥ కలిగిన 6 గదుల ఇల్లు అన్ని సౌకర్యములు కలిగినది అమ్మకమునకు కలదు. ధర. 95 లక్షలు. 9676285248, 9505610078. [M-1221868]
■ ఖమ్మం శ్రీనగర్ కాలనీ రోడ్ నెం. 13లో 95 లక్షల ఇల్లు మరియు సూర్యానగర్, దరిపల్లి ఇంజినీరింగ్ కాలేజ్ దగ్గర 25, 65 లక్షలలో ఇల్లు అమ్మకానికి కలవు. సంప్ర. 81858 21113. [M-1221875]

TO-LET
■ ఖమ్మం, కవిరాజ్‌నగర్, తెలంగాణ ఏజెన్సీ పైన 2 హాల్ 1400 sft. మరియు 900 sft. కమర్షియల్ అద్దెకు ఇవ్వబడును. వివరాలకు సంప్ర. సెల్ : 73826 64450. [M-1221908]
■ ఖమ్మం, శ్రీనగర్ కాలనీ రోడ్ నెం. 13, వైరా రోడ్డుకు దగ్గరలో లవేరా అపార్ట్‌మెంట్ 2BHK కవర్డ్స్ కలిగి 1st Floor Flat No. G4 అద్దెకు ఇవ్వబడును. 98497 23138. [M-10737]

Services

■ హౌస్, ఫ్లాట్, వ్యవసాయ భూములు మార్టిగేజ్ చేసుకొని వారంలో అమౌంట్ ఇప్పించబడును. బెట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ వారికి చేయబడును. సెల్: 7842278342, హన్మకొండ. [WA-7246]

FINANCIAL SERVICES
■ ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలకు శుభవార్త ! హౌసింగ్ లోన్స్, పర్సనల్ లోన్స్, మార్టిగేజ్ లోన్స్, కారు లోన్స్, సైట్ లోన్స్, ఓడి లోన్స్, టేకోవర్ & టాప్అప్ లోన్స్, పర్చేజ్ లోన్స్, బిజినెస్ లోన్స్ ఇప్పించబడును. 9491499921, 9581142355 [M-1221870]

HEALTH SERVICES
■ Star Health : ఆరోగ్య అవసరాల కోసం Health Polasi చేయండి. ధీమాగా ఉండండి. హెల్త్ పాలసీ పూర్తి వివరాల కొరకు సంప్రదించండి. సెల్ : 91007 57031. [M-1221919]

OLD AGE HOME
■ ఒమేగా హోంకేర్ వంట/ఇంటి పనిచేయుటకు, వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను 24 గం॥లు చూసుకొనుటకు మీ ఇంటికే కేర్‌టేకర్స్‌ని పంపబడును. హైదరాబాద్. Ph: 8977639664/ 8977639665 [H-793653]

Wanted

■ Jr. Accountant : Tally Prime, Excel. Exp. : 1-2 years, Office Asst. : Online Tendering and DTP work. Chakradhar Engg. Prakash Nagar, Cell-94406 22069 [M-2788]
■ కొత్తగూడెంలో ప్రముఖ శ్రీ వేంకటరమణ ఆయుర్వేదిక్ హాస్పిటల్ నందు పని చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. 19 సం॥ఆపైన, 10వ తరగతి ఆపైన. 94408 73399, 73309 93569. [M-1221288]
■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9573633520, 9059633520. [M-1221874]
■ మా ఆఫీసు న్యూ ప్రాంచేజ్ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్‌టైమ్/ ఫుల్ టైమ్ వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. సంప్ర: 9177736926 [G-824711]
■ Wanted Assistant Designer : Wanted Lady Assistant to work in leading Designing Boutique, Khammam. Qly. Above Inter with Tailoring knowledge and intrest in latest women Fashion. Ph. : 86391 31659. [M-10509]
■ రామకృష్ణ గ్రూప్ (T.SNo-1) Hyd శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులకు/ పేషెంట్ల సేవకు, వంట/ఇంటిపని, బేబికేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. భో+వ+జీతం 15-21వేలు, ఏజెంట్లకు 5వేలు కమీషన్. తెలంగాణ అంతటా వర్కర్లను మీ ఇంటికే పంపగలము. Ph: 9515119570/ 9515108830 [H-793524]
■ కృష్ణాజిల్లా, జగ్గయ్యపేట మండలంలో ప్రముఖ సిమెంట్ ఫ్యాక్టరీలో మా సంస్థ అయిన సత్యా ఇన్వెస్టిగేషన్ & సెక్యూరిటీ సర్వీసెస్, గుంటూరు తరుపున పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ మరియు సంబంధిత ఫీల్డ్ వర్క్‌లో మంచి అనుభవం ఉన్న ఫీల్డ్ ఆఫీసర్ వెంటనే కావలెను. సెక్యూరిటీ గార్డ్ అర్హతలు: వయస్సు 23-45 సం॥లు, అర్హత: 10వ తరగతి, ఎత్తు: 05'-06'' ఆపైన, రిటైర్డ్ ఆర్మీ, పారా మిలటరీ వారికి ప్రాధాన్యత. సంప్ర: 8466996958, 7095125556, 0863-2951838 [G-328]
■ REQUIRED CIVIL CONTRACTORS IRP Infra Tech Pvt Ltd, a leading telecom infrastructure company, is looking for CIVIL CONTRACTORS to execute Civil Foundation works for Telecom Towers and Solar Structures in various parts of Andhra Pradesh. Interested contractors can apply by E-mail to: civilirp23@gmail.com or contact us at: 79812 72969 91604 42234 [OA-297]

సాక్షి క్లాసిఫైడ్స్
ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు మా ప్రతినిధులను సంప్రదించండి
వివరాలకు :

ఖమ్మం	: 9705444182
	9010299957
కొత్తగూడెం	: 9010223783
పాల్వంచ	: 9705444183
భద్రాచలం	: 9951602914
మణుగూరు	: 9705944416
సత్తుపల్లి	: 9652868642

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.